# పరిత్యక్త

దేవతార్చన గృహంలోంచి, మండువాలోకి వచ్చి కనుచూపుమేర వరకూ ఒక్కసారి పరికించి. నిట్టూర్చి, తిరిగి గృహాంతర్భాగంలోకి, మంద మందంగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయింది పార్వతమ్మ.

అపరాహ్నం దాటింది.

శతవృద్ధుని నిశ్వాసంలాగా వున్న వేసవివాయువు ప్రపంచంలోని వేదననూ కల్మషాన్నీ తనతో మూట గట్టుకుని ముందుకు ప్రయాణం సాగిస్తున్నది. దూరంగా, చావలేక బ్రతుకుతున్న వో చెట్టుమీద గూడు సరిగా అమరక బాధపడుతున్న ఓ కాకిపిల్ల క్షణిక జగతి నదేపనిగా తిట్టిపోస్తున్నది. ఆకాశంలో రంగులు మార్చుకోలేక బాధపడే ముదురు మబ్బులు, మర్రిచెట్టు నీడక్రింద ఉచ్ఛ్వాస నిశ్వాసాల నతిభారంగా పీలుస్తున్న పాంథజనులు, ఎండిపోబోతున్న చెరువులోని బురదనీటినే ఆప్యాయంగా గతుకుతున్న ఒకటి రెండు కుక్కపిల్లలు - జీవనస్రవంతి ఎండిపోయి, హృదయంలోని బడబాగ్ని ప్రజ్వరిల్లడానికి అంకురార్పణ జరుగుతున్నది.

అపరాహ్నం దాటింది.

ప్రపంచం బాధగా మూల్గుతూ కాళ్ళు రెండూ దగ్గరకు ముడుచుకున్నది. పార్వతమ్మ మరొక్కసారి బయటకువచ్చి తొంగిచూచింది. ఎవ్వరూ కన్పడలేదు. తన యింటివేపు ఎవ్వరూ నడచి రావడంలేదు.

గడప దగ్గరగా, గోడనానుకు నిలబడ్డ పార్వతమ్మ, నడుంచుట్టూ త్రిప్పు కున్న పమిటచెంగు జారవిడిచి, క్రింద పఱచుకు దిగాలుగా కూచు న్నది - కళ్ళు మూసుకుని మనసుకు సమాధానం చెప్పుకుంటూ కూచు న్నది - యౌవనం దాటి వృద్ధాప్యంలోకి అడుగుపెట్టిన మనసుకు సమా ధానం చెప్పుకోలేక బాధపడుతూ కూర్చున్నది. కూర్చున్నది, గోడకు తలనానించి విశ్రాంతి పుచ్చుకోలేక, గడపమీద తలక్రింద చెయ్యిపెట్టు కుని కళ్ళు రెండూ మూసుకుని, దగ్గరగా మరీ దగ్గరగా తన అవయవా లను కూడదీసుకుని పడుకున్నది. పడుకున్నది, నెరుస్తూ నెరుస్తూ వున్న తన కేశ సంపదను గురించిగాని, బాధలతో ఆలోచనతో ముకు ళించుకుని సౌందర్యాన్ని కోల్పోతున్న తన వదనాన్ని గురించి కాని, నిత్య దేవతారాధనంలో చన్నీళ్ళ స్నానాలతో సౌకుమార్యాన్ని కోల్పో తున్న తన తనూలావణ్యం గురించిగాని, ఆలోచించక, నైరాశ్యంతో బాహ్యావసరాలవేపు దృష్టిని మళ్ళించడం మానివేసి పడుకున్నది.

ఆమె ఇంతటి శ్మశాన ప్రశాంతత నలవర్చుకోవడం, మొన్న గడిచిన ఏకాదశినాటికి అర్ధ పుష్కరం నుండి. ఆనాటికి ఆమె జీవితం ఇంత అధ్వాన్నం కాలేదు. పరమేశ్వరం, ఆమె, ఒక గదిలోనే. బయట వారికి కన్పించడం కోసమని రెండు మంచాలు వేసుకున్నా, ఒక మంచంమీదనే, ఒకప్పుడు ఒకరితో మరొకరు కబుర్లు చెప్పుకుంటూనూ, మరొకప్పుడు ఒకరి నిట్టూర్పులో మరొకరు కరిగిపోతూనూ వేరొక సమ యంలో ఒకరిలో కన్నీళ్ళు మరొకరిలో మందహాసాలతోనూ, దాదాపు పరమేశ్వరమూ పార్వతమ్మా శరీరాత్మలు అన్నట్లు ప్రవర్తించారు.

ఇప్పటికీ పార్వతమ్మకు ఆ విషయం బాగా జ్ఞాపకం వుంది.

గడపమీద పడుకుని కళ్ళు మూసుకున్న పార్వతమ్మ పెదవులపై కన్పించీ కన్పించని హాసలేఖ. ఆమె హృదయాకాశంలో ఆనంద కాంతి. ఆమె కన్నులనుండి రెండు కన్నీటి చుక్కలు ఆమెకు తెలియ

కనే ఆమె వక్షస్థలం మీదకు జాలువారినవి. అప్పటికి సాయంకాలం సమీపిస్తూ సమీపిస్తూ వున్నది - వెలుగు చీకటితో దోబూచులాట. బుచ్చిబాబుగారి పెద్దమ్మాయి నీళ్ళోసుకున్నదని తెలిసి, తను చూడడానికి వెళ్ళి తిరిగి వస్తున్నది. ఊరినుండి ఎపుడు తిరిగి వచ్చారో ఏమో, చుక్కలను లెక్కపెడుతూ, చుట్టంలాగా, వాలు కుర్చీలో పడుకుని వున్నారు వారు. మందమందంగా వున్నగాలి వారి స్పర్శలాగా, వారి సరసంలాగా తనను స్పృశిస్తోంది. తను గబగబా నడిచి, తలుపుతీసి, "లోపలకు రండీ !" అన్నది ఎంతో అప్యాయంగా.

ఆయన ఒకసారి తనవేపు చూశారు. ఆచూపులో ఎన్నిభావాలు!! తన సహచరులు తనను పరాచకాలాడిన రాత్రి, మంచానికి ప్రక్కగా సిగ్గుసిగ్గుగా మౌనంగా తను నిలబడిన రాత్రి, వారు తనను చూచిన చూపు, అపుడు మరల తనకు జ్ఞాపకం వచ్చింది.

లోపలకు నడిచి, లైటు వెలిగించి, చావడి ప్రక్కగానున్న గదిలోకి వచ్చింది. అక్కడవున్న నిలువుటద్దంలో........పట్నంలో తను చూచిన రంగు రంగుల చేప పిల్లల్లాగా, అటూ ఇటూ వింతవింతగా కదులాడుతున్న తనకళ్లు .... శైశిరమాస మేఘ సంపదలాగా చెదరిన తన కేశసంపద .... తన పెదిమలు తడబడుతున్నవి. ఆయనను గడప ఇవతల తనుచూసేసరికి, తనకాళ్ళలో, కళ్ళలో ఏదోఅదురు, నిలబడలేక ఆ సంభ్రమోద్వేగాల్లో మంచాన్నానుకొన్నది. ఆయన తనను చూచారు.

"ఏమిటి ? - ఏమిటి పారూ ? - ఆయన అభిమానంలోంచి పుట్టుకువచ్చిన ఆ ప్రశ్నకు తనేమని సమాధానం చెప్పేటట్లు ? నవ్వీ నవ్వకుండా నవ్వి తనలో తను కుంచించుకుపోతూ వారిపట్టునుండి విడి పించుకోబోయింది. వారు తనను తననింకా దగ్గరగా తీసుకొంటు న్నారు. వారి కళ్ళల్లో ఏదో కాంతి .... ఆ ఆవేశం .... నరనరాల్లోని ఆ చైతన్యం .... 'పారూ ! చెప్పవూ ! - నాకు చెప్పవా? - పారూ?-

తనను వారు దగ్గరకు తీసుకొంటున్నారు. వారి పెదవులు వెచ్చగా కదులుతున్నాయి. ఏదో అనబోయింది. అనబోతున్న నోటిని, నోటితోనే మూసివేశారు. "పారూ!" మళ్ళీ ప్రార్థన. అభిమానంగా అడగడం!!

తను చెప్పాలి! తప్పదు! వారికి చెప్పాలి. వారికి కాకపోతే తానింకెవరికి చెప్పగలదు? వారు తనవంకే చూస్తున్నారు: కళ్ళల్లో కళ్ళుపెట్టి, పెదవులను సన్నగా నొక్కుతూ, బుగ్గలు బాధగా మండుతున్నాయి. తనూవల్లిక మందమందంగా కంపిస్తున్నది. వారు తన వంకనే చూస్తున్నారు. సన్నగా నవ్వుతున్నారు. అంతా చిలిపితనం. అమ్మ దొంగా! – అదిగో ఆ చేతిలో ఎర్రని ఉలిపిరికాయితంలో ఏమిటది? – చెవిలో వారి రహస్యవాక్కు– స్నిప్ధకంఠంతో. "పారూ! నీ కోసమే పారూ! ఇవాళేకదూ నీ పుట్టిన రోజు. అందుకని – ఈ బీదవాడి ప్రజంటు – ఓ నెక్లెస్ – ఎంతో కాదు, అయిదువందలే!"

అమ్మో! అయిదు వందలే!!

తన హృదయం అంత ఆనందాన్ని భరించలేదు. తన జీవితంలో ఇంత సుఖం, ఇటువంటి క్షణం, మళ్ళీ రమ్మన్నా ఇటువంటి వసంతం, తన జీవితంలో ఇహరాదు. మళ్ళీ వారి మాటలు "పారూ! ఇటురా! దగ్గరకు .... ఇంకా దగ్గరకు .... నన్ను, నా చేతులతో నిన్న లంకరించుకోనీ పారూ!" తప్పదు. ఈ సమయంలోనే వారికి చెప్పాలి. చెప్పితీరాలి. "ఏమండీ! మీరు .... మీరు!" అబ్బ! – ఎట్లా ఆ వాక్యాన్ని పూర్తి చెయ్యడం?

"ఏమిటి పారూ! – నేను, నేనూ – ఆఁ! నేనేంటి?" తనను మరీ గట్టిగా హృదయానికి హత్తుకుంటూ అడుగుతున్నారు.

తను దూరంగా తొలగింది. ఆనందకరమైన ఆత్రుత. భరించలేనంత ఆనందంతో కూడినబాధ. మెల్లిగా "మీరూ .... మీరూ ....

నీన్న....!" తను వాక్యం ఇంకా పూర్తిచెయ్యనైనా లేదు. దెబ్బతిన్న వారిలాగా ఓ అడుగు వేశారు. "నిజమేనా ? - నిజమేనా పారూ ఇది!" వారి మనసు శతధా విభాగమైనట్లుంది. వారి చేతిలోని నెక్లెసు క్రింద పడి దెబ్బతిన్నది. "ఎందుకని ? - ఎందుకట్లా అయ్యారు వారు - అది ఆనందంకాదు. మరేమిటి ?' తన మనసులో సందేహాల సాలెగూడు.

"పారూ ! ఎన్నాళ్లైంది మన పెళ్లై ? మన వివాహం జరిగి ఒక్క సంవత్సరం, అవును ఒక్క సంవత్సరమన్నా కాలేదు కదూ!" వారు మాట్లాడకుండా బయటకు వెళ్ళిపోయారు.

* * *

గడపమీద పడుకున్న పార్వతమ్మకు కండ్లు నీటి కుండలే అయ్యాయి. వక్షస్థలం మీదకు నీరు జాలువారింది. చీరకట్టులో దాగి వున్న అవయవాలు ఒక్కసారి కదిలి యాడినవి. మనసూ దేహమూ, స్వప్నమూ, ప్రకృతీ కలిదిండిగా కలిసిపోయిన టన.

ఎవరివో పాదాల చప్పుడువిని, పార్వతమ్మ భర్త ఏమోనని కళ్ళుతెరచి వీధివేపు చూసింది.

తెల్లని నిడుదములైన నామాలు ధరించి, కావిరంగు ధోవతికట్టి, మెళ్ళో తులసిపూసల పేరుతో, ఆచార్లగారు లోపలకు వచ్చారు. ఆయన ఆ వూరికి ఏకైక ధన్వంతరి. ఆచార్లవార్ని చూసి, కళ్ళు తుడుచుకుని, చీర సర్దుకుని, లేచి కూచుని 'రండి' అంటూ పేలవంగా ఆహ్వానించింది పార్వతమ్మ. ఒక్కసారి పొడుం పీల్చి "కుశలమేనా అమ్మాయ్ !" అన్నారు ఆచార్లవారు ప్రక్కనేవున్న కుర్చీలో ఉపవిష్టులౌతూ.

"ఏమమ్మాయ్ - అలా వున్నావ్ ?" మళ్ళీ ప్రశ్నించారు ఆచార్లువారు.

ఆ ప్రశ్నవిని ఆమె హృదయంలోని రామచిలుక రెక్కవిప్పి అంగలార్చింది. ఆమెనుచూసి అతని హృదయం లోని శ్రావణ మేఘాలు అల్లల్లాడినవి.

ప్రక్కయింట్లో మదవతి యొార్తు తనబిడ్డ నతి క్రూరంగా మంద లిస్తున్నది. బిచ్చగత్తెయొకర్తు పిల్లవాడికి పాలురాక, గ్రుడ్లనీరు గ్రుడ్ల క్రుక్కుకుంటున్నది. యౌవనం వస్తూవస్తూన్న అవుదూడ ఒకటి, ఎండిపోయిన రొమ్మునుండి పాలు పిండుకోవాలని వ్యర్థప్రయాస చేస్తూ తల్లిని నిర్దాక్షిణ్యంగా బాధిస్తున్నది. పిల్లవాడు : పాలు ! ! అవుదూడ - మాతృప్రేమ ! ! ఆమె వక్షస్సు విప్పారుకొన్నది. జారుముడి వేసుకున్న రవిక వదులుబారింది. తెలియని తన్మయత్వం ఆమె నాక్రమించింది.

"ఆచార్లుగారూ !" అంటూ సన్నగా మూలిగింది. తనలో తను కుమిలిపోతూ "నేను హంతకురాలిని, నేను ... నేను .... అవును, చంపుకొన్నాను నా బిడ్డను నేను! అంటూ గద్గదికంగా పలికింది.

తండ్రివంటి ఆచార్లుగారు ఇదంతా చూశారు. భార్యావిహీనుడై విధుర జీవనక్లేశాన్ని గడుపుతున్న ఆయన మనస్సుని మాతృత్వపు ప్రేమాంబుధి తరంగం ఉవ్వెత్తుగ క్రమ్ముకొన్నది. ఉత్తరీయంతో, మొహాన్ని తుడుచుకొన్నాడాయన.

"అమ్మాయీ ! నువుకాదు, ఆ హత్యకు కారణం - నే--ను."

తల యెత్తుకున్న పార్వతమ్మ మళ్ళీ తల దించుకోలేదు.

"ఆనాడా ఔషధాన్ని నీ కియ్యక పోయినట్లయితే - అమ్మాయీ!- అవును తల్లీ - నిజమే చెబుతున్నాను. నా పాపానికి పరిష్కార మేమిటి ? నువ్వూ నవ్వుతూ కొడుకు నెత్తుకుని నాకళ్ళముందు తిరుగు తుండేదావిని కాదూ ?" ఆయన గొంతు జీరవోయింది. "పార్వతమ్మా! నాపాపానికినిష్కృతిలేదు లేదు." తనకుతానుమార్గం చూపించుకొనలేని

పార్వతమ్మ ఆయనను సముదాయించ బోయింది." అంతా నా ఖర్మ
ఆచార్లగారూ విధిహతులం మనం. దేవుడు మనతో ఆటలాడుకుని
ఆటలాడుకుని, చటుక్కున మన రెక్కలు విరిచేస్తుంటాడు. అంతే
మన బ్రతుకులు."

"వద్దుతల్లీ! వద్దు. అంతలేసి మాటలనకు. మనం చేసే పిచ్చి
పనులకు ఆ నారాయణమూర్తినికూడా దూషించడ మెందుకు? పరమే
శ్వరం తన లాయరీతనం అంతా నాదగ్గరే చూపించాడు. కరిగిపోయాను.
నిన్ను—నిన్ను—గొడ్రాలును చేశాను. అమ్మా, పార్వతమ్మ తల్లీ!"

పార్వతమ్మ ఏమీ మాట్లాడలేదు. గ్రుడ్లప్పగించి అటేచూస్తూండి
పోయింది. ఆమెలో కోటి కోటి కాలకూట సర్పాలు పడగలు విప్పి
ఆడుతున్నవి. ఆచార్లగా రిదేమీ గమనించలేదు. బాధతో, డగ్గుత్తి
కతో, కంటినీటితో, చెప్పుకుపోతున్నాడు. "నేనుచేసింది అన్యాయమే.
కాదనను. కానీ ఈ అన్యాయాన్ని నేను నా అంతట నేను కావాలని
చేసినది కాదు. పరమేశ్వరం ఒక రోజు ప్రొద్దున్న నా దగ్గరకు
వచ్చాడు. ఆ మందు కావాలన్నాడు. నాకాశ్చర్యం వేసింది. "అదే
మిటి పరమేశ్వరం! ఆ మందు ఎంత అపాయకరమైనదో నీ కేమైనా
తెలుసా?" అన్నాను. అతడు వెంటనే ఒక్క క్షణంకూడా ఆలోచించ
కుండా "ఆ మందు వాడకపోతే ఎటువంటి అనర్థాలు కలుగుతాయో మీ
కేమైనా తెలుసునా?" అన్నాడు. నాకేం తెలుసు తల్లీ. కాపురానికి
రాకముందే భార్యను పోగొట్టుకున్న దౌర్భాగ్యుణ్ణి. అప్పటినుండీ
ఆ నారాయణమూర్తి సేవలోనే తనువును తెల్లవార్చుకుంటున్న వాణ్ణి.
అప్పుడు పరమేశ్వరం నాతో ఏమన్నాడో తెలుసునా అమ్మాయ్?
'ఆచార్లుగారూ! మీరిప్పుడు నే చెప్పిన పనికి ఒప్పుకోకపోతే జరిగే
దేమిటో ఆలోచించండి. ఈ వేసవి కాలానికి పార్వతి ఒక పిల్లవాణ్ణి
చంక నెత్తుకుంటుంది. మనదేశంలో పిల్లలు కలగకుండానే వుండాలి

కాని, కల్గడమంటూ ప్రారంభిస్తే, అది యిహ కుచేలసంతానమే. ఒక్కసారి వూహించండి. చంకనొకబిడ్డ. కాళ్ళదగ్గరొక బిడ్డ. తలమీదఒకడు, చేతుల్లోమరొకతె. భగవంతుడా! పాలకోసం ఒక పసిది అరిస్తే, పంచదారకోసం మరొక నోరులేనివాడి గోల. ఆలోచించండి. జవసత్వాల్లేని పార్వతి — అంద విహీనురాలైన పార్వతి— తల వెంట్రుకలూడి— పండ్లూడి—మొహమంతా ముడుతలు పడి — దేహంలోని బిగువుసడలి ఆచార్లగారూ! వద్దు—వద్దు—అటువంటి పార్వతి నాకు వద్దు" అంటూ అతను నాచేతులు పట్టుకున్నాడు. అప్పుడు నేనుకూడా క్రొత్తగా నేర్చుకుంటున్నాను వైద్యం. ఆ మూలిక ఫలానా శక్తి గలది అని మాత్రమే తెలుసుకొని, ఇంతటి విపరీత పరిణామం నీలో కలగ జేస్తుందని వూహించలేక పోయాను."

ఆచార్లగారి రుద్ధ కంఠంవిని పార్వతమ్మ ఆయనవేపు నిశితంగా తేరిపార జూచింది. ఆయన నోట్లోంచి మాటలు వచ్చీరాక తడబడుతున్నాయి. కళ్ళనిండా నీళ్ళు. ముక్కు కొనవూపిరితో అటూయిటూ కొట్టుకుంటున్నది.

పార్వతమ్మ మెల్లగా లేచి నుంచున్నది. నాకు కావలసింది నా రక్తమాంసములు పంచుకు పుట్టిన నా పాప—నా పాప—పా—ప" ఆమె మాట్లాడలేక పోయింది. మాట్లాడలేక చీర చెరగు నోటికడ్డం పెట్టుకుని, గుండె నదుముకున్నది.

ఆచార్లగారి కెలా ఆమెను సముదాయించాలో తెలియలేదు. మౌన వేదనమ భరించలేక "భోజనం చేశావా తల్లీ ?" అన్నాడు.

ఆమె పేలవంగా నవ్వింది. ఆ నవ్వు, ఆమె భోజనం చేయలేదన్న సంగతిని అతనికి తెల్పకుండా తెల్పింది. విషాద వదనంతో, "శరీరం శుష్కింపజేసుకుని మనం చేయగలదేమున్నది! వెళ్ళి భోం చేసిరా," అన్నాడు.

"భోజనం!" పార్వతమ్మ తనలో తను గొణుక్కుంటున్నది. "వారు వేళకు ఇంటికి రారు. నా మొహం చూడరు. వారికి అందం కావాలి. నాకు బిడ్డలు కావాలి. మీకు నా భోజనం కావాలి. బావుంది, బావుంది ఆచార్లగారూ! చాలా బావుంది." పిచ్చిగా నవ్వుతూ ఆమె లోపలకు వెళ్ళిపోయింది. బయట ఇంకా ఆ అవుదూడ రంకెలు పెడుతున్నది. పిల్లవాడికి పాలిమ్మకోలేక ముష్టిది దీనంగా విలపిస్తూనే వున్నది. ప్రక్క యింట్లోంచి ఆ గయ్యాళి తల్లి తన పసివాడిని చీదరించుకొంటూనే వున్నది. ప్రపంచం యధాప్రకారం ఋతువుల మార్పులతో, పరదాలను తొలగించుకొంటూ భవిష్యత్తులోకి అడుగుపెడుతున్నది. తలవంచుకుని కూర్చున్న ఆచార్లగారి కళ్ళనుండి రెండు కన్నీటి చుక్కలు అతని ధోవతిపై బడి, ప్రపంచాన్ని చూడలేక మరణాన్ని కోరుకుంటున్నాయి.

* * *

"పార్వతీ! పార్వతీ! ఎక్కడ? ఇల్లంతా ఈ చీకటేమిటి? ఎక్కడ పార్వతి నువు!" నిశ్శబ్దం గూడుకట్టుకున్నట్లున్న ఆ యింట్లో, పరమేశ్వరానికి ప్రతివచనం పలకలేదెవరూనూ.

"నాన్నాలూ! బయం... బయం.... బూచి!" చంకనున్న పసిబిడ్డ పరమేశ్వరం గొంతును గట్టిగా కావలించుకుని, అతని చెవిలో రహస్యం చెబుతున్నట్లుగా మెల్లగా అన్నాడు.

"నాన్న! పరమేశ్వరం గుండె లోతుల్లోనుండి అనిర్వచనీయమైన ఆనందరేఖ ఏదో అతని సర్వావయువాలనూ స్పృశిస్తోంది. "ఎవరీ కుర్రవెధవ. వీడికీ తనకూ సంబంధమేమిటి? తను రైలు దిగి వస్తున్నాడు. సందె చీకటి. ఊడలు చాచుకున్న మఱ్ఱిక్రింద వెర్రిగా రోదిస్తున్న ఆ రెండేండ్ల పసిబిడ్డడు. నాన్న! నాన్న! ఆ దురదృష్టవంతుడి

పిలుపులో మరొకపలుకు లేదు. రా తండ్రీ" అన్నాడు తను. ఆమాట తను ఎందుకన్నట్లు ? ఆ చిట్టితండ్రి ఏడ్పుమాని చేతుల్లో సందు చేసుకున్నాడు. అప్పటినుండి నాన్న! నాన్న!అంటూ తనకు తెలియని లోకపు ద్వారాలనేవో తన మనసులో తెరుస్తున్నాడు."

"నాన్నలూ బియం—బియం—బూచీ."

"లేదు తండ్రీ, అమ్మను పిలుస్తానుగా! వుండు" అంటూ "పార్వతీ" అంటూ మరొకసారి పెద్దగా కేకవేశాడు పరమేశ్వరం. చీకటిలో అతని కంఠస్వరం ఖంగుమన్నది. ముందుకు అడుగువేసిన అతనికి గదిగుమ్మం తగిలి తల బొప్పికట్టింది. పరమేశ్వరం బుజానవున్న పసిపాపను క్రిందికి దించి కూచో బెట్టాడు. ఆ చంటివాడు సన్నగా ఏడ్పు ప్రారంభించాడు.

పరమేశ్వరం జేబులోనుండి అగ్గిపెట్టి తీసి, అగ్గిపుల్ల వెల్గించాడు. ఆ అగ్గిపుల్లవెల్గులో దూరంగా ఎవరది ? - మంచానికి దగ్గరగా పేము కుర్చీలో కూచుని, మంచంపట్టిమీద తలవాల్చి మోచేతిమీద పడుకున్నట్లు కన్పిస్తూ, ఎవరు - ఎవరది ?

పరమేశ్వరం మరొక్క అగ్గిపుల్ల వెల్గించాడు. పార్వతి తలలో పూలు కన్పించాయి. 'పార్వతీ!' అంటూ రెండడుగులు ముందుకు వేశాడు. ఆరిపోతున్న అగ్గిపుల్ల వెల్గులో పార్వతమ్మ కట్టుకున్న పట్టుచీర నిగారింపు. వెనకనుంచి ఆ పసిబిడ్డడేడుస్తున్నాడు.

"పార్వతీ! అపూర్వమైన బహుమతి తీసుకువచ్చాను నీకు. నీవు ఎన్నడూ ఊహించనిది, నువ్వు అనుక్షణం కోరుకుంటున్నది, నేనునీకు తెలియక చేసినఅన్యాయానికి నన్ను క్షమించగలిగేది, అటువంటి బహుమతిని తీసుకువచ్చాను. నామీద కోపం మాను పార్వతీ! నన్ను క్షమించు పార్వతీ."

పార్వతమ్మ మెడలో తానొక దశాబ్దం క్రింద ఆమెకు బహూకరించిన రాళ్ళనెక్లెసు మెరుస్తూ, చీకటిలో చీలికలకు ఎంతకాంతి నిస్తున్నది. "పార్వతీ!" అంటూ ఉపగూహనం చేసుకో బోయాడు. అతన్ని పొదువుకుంటూ చీకటి. అతన్ని కాల్చివేస్తూ పసిబిడ్డ ఏడుపు. అతన్ని క్షమాపణ కోరుకుంటున్నట్లుగా, నిర్జీవమై అతని కాళ్ళదగ్గర పడిపోయిన పార్వతి. అతని చేతిలో అగ్గిపుల్లలు వెల్గుతున్నాయి. సర్వేంద్రియాలూ మంటలతో దహింపబడుకున్నాయి. నిర్జీవమైనపార్వతి కబంధహస్తాల మధ్య చిక్కుబడ్డ ఉత్తరం అతనికి రంపపుకోత పెడుతున్నది.

"మీకు నా శరీరం కావాలి. మలమూత్ర రక్త మాంసాలతో నిండిన ఈ శరీరం కావాలి మీకు. ఇంతకాలమూ ఈ శరీరాన్ని మీ కోసమే పోషిస్తూ వచ్చాను. ఇటుపై పోషింపగల ఓపిక నాకు లేదు. ఈ శరీరాన్ని మీకే వప్పగించి వెళ్తున్నాను. ఎంతకాలం ఈ శరీరంతో ఆనందం అనుభవిస్తారో అనుభవించండి."

పసిబిడ్డడు ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లాడు. పరమేశ్వరంలో చైతన్యం లేదు. చీకటి కరుళ్ళు కరుళ్ళుగా అతని జీవన సౌందర్య సిద్ధాంత భ్రాంతిని మ్రింగివేస్తున్నది. పేరుకున్న కృతకవాంఛలు కరిగిపోయి తెలియనితనమేదో అతన్ని పొదువుకుంటున్నది.

—0—